ప్రజలకు చేరువవుతున్న గంజి

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ గుడ్ మార్నింగ్ మంగళగిరి అనే కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేస్తున్నారు మంగళగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ గంజి చిరంజీవి. సోమవారం 14వ వార్డు షరాఫ్ బజార్, రెండు రామ మందిరాలు, తెనాలి రోడ్, తదితర ప్రాంతాల్లో పర్యటిస్తూ, వారికి జగనన్న ప్రభుత్వంలో అందిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఆ ప్రాంత ంలో ఉండే తటస్తులను కలుస్తున్నారు. కార్యక్రమంలో వెనిగళ్ళ నాగేశ్వరరావు, కన్వీనర్ మహమ్మద్ ఫిరోజ్, తోట శ్రీనివాసరావు, ఆకురాతి రాజేష్, బలిజ కార్పొ రేషన్ చైర్మన్ భవానీ, రంగిశెట్టి పెద్దబ్బాయి, గుంటి రాజ్యలక్ష్మి, నిర్మల, పూజల మనోహర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌తో : మంగళగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ గంజి చిరంజీవి మంగళగిరి వాకర్స్ అసోసియేషన్, నేచర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ఉదయం ఆత్మీయంగా పలకరింపులతో సరదాగా గడిపారు. జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన మంగళగిరి ఎకో పార్క్ ఆవరణలో నిత్యం ఉదయం పూట వాకింగ్ చేసే వాకర్స్ సభ్యులతో గడిపారు. గంజి చిరంజీవి మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్య ఉంటూ అందరిలో ఒకడిలా ఉండే తనను ఆశీర్వదించమని కోరారు.

పేదల ఇళ్లపై జగన్ రెడ్డి చిన్న చూపు

విశాలాంధ్ర-గుంటూరు : టిడ్కో ఇళ్లు పేదలను ఊరించి ఉసూరు మనిపిస్తున్నాయని తెలుగు దేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రారంభమై 70 శాతం పూరైన పనులను అర్ధారంగా జగన్ రెడ్డి నిలిపివేశారన్నారు. టిడ్కో ఇళ్లను వైసీపీ ప్రభుత్వం కొలిక్కితేవడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. జగన్ పేదలపై ఎంత కక్షతో వ్యవహరిస్తున్నారో చెప్పేందుకు టిడ్కో ఇళ్ల రద్దే నిదర్శనమన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వంలో పేద, మధ్యతరగతి ప్రజలకు నిరాశ, నిట్టూర్పే మిగిలిందన్నారు. ఒక్కో ఇంటికి లక్షల రూ.లు అప్పులు చేసి డిపాజిట్లు కట్టిన లబ్ధిదారులు, ఇప్పుడు వాటికి వడ్డీలు కట్టలేక ఆత్మ హత్యలు చేసుకుంటున్నారన్నారు. జగన్ రెడ్డికి మాత్రం పులివెందులలో ప్యాలెస్, హైదరాబాద్ నివాసం లోటస్ పాండ్, చెన్నైలో కూడా ఒక ప్యాలెస్, రిషికొండ పై ప్యాలెస్, బెంగుళూరు ప్యాలెస్‌లు అవసరమా అని ప్రశ్నించారు.

యూనిక్ తైక్వాండో క్రీడాకారునికి స్వర్ణపతకం

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి, చెంచుపేట యూనిక్ తైక్వాండో క్రీడాకారుడు కంభం వినయ్ విజ్ఞాన్ యూనివర్సిటీలో జరిగిన నేషనల్ లెవెల్ యూత్ ఫెస్టివల్ క్రీడలలో తైక్వాండోలో అండర్ 68 కేజీల విభాగంలో పాల్గొని స్వర్ణ పతకం, నగదు బహుమతి పొందాడు. తైక్వాండో కోచ్ అకాడమీ డైరెక్టర్ బట్టు నాగరాజు వినయ్‌కు అభినందనలు తెలియజేశారు. విజ్ఞాన్ యూనివర్సిటీ వారు ప్రతిసంవత్సరం విజ్ఞాన్ మహోత్సవ్ పేరుతో నేషనల్ లెవెల్ యూత్ ఫెస్టివల్ క్రీడలను నిర్వహిస్తున్నారని, క్రీడాకారులను ప్రోత్సహించి నగదు బహుమతి అందించడం అభినందనీయమన్నారు. అకాడమీ గౌరవాధ్యక్షులు అందె బాలచంద్రమౌళి, పలువురు పెద్దలు వినయ్‌కు అభినందనలు తెలియజేవారు.

సీపీఐ-సీపీఎం నాయకులపై కేసు కొట్టివేత

విశాలాంధ్ర-తాడేపల్లి : 2018లో రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఉండవల్లి సెంటర్‌లో ఆందోళన కార్యక్రమం చేపట్టిన సందర్భంగా తాడేపల్లి పోలీసులు సీపీఐ నాయకులు కంచర్ల కాశయ్య, సీపీఎం నాయకులు ఎం.రవి, దొంతిరెడ్డి వెంకటరెడ్డిలపై వివిధ సెక్షన్ల కింద అక్రమ కేసును నమోదు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ వారు రుజువు చేయలేకపోవడంతో సోమవారం మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.శ్రీ ప్రత్యూష కేసు కొట్టి వేస్తూ తీర్పునిచ్చారు. ప్రముఖ న్యాయవాది కోకా వెంకటప్రసాద్ వాదించారు.

గరికపాటి రాజారావు జయంతి

విశాలాంధ్ర-పొన్నూరు: ఆంధ్ర ప్రదేశ్ ప్రజా నాట్యమండలి పొన్నూరు శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద డాక్టర్ గరికపాటి రాజారావు జయంతి సభను నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి గేయ రచయిత దేవరకొండ శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ప్రజా నాట్యమండలి గుంటూరు జిల్లా కార్యదర్శి అరేటి రామారావు మాట్లాడుతూ సినీనటులు మిక్కిలినేని, పెరుమాళ్, అల్లు రామలింగయ్య, జమున, వరలక్ష్మి, కాకరాల, లాంటి ఎందరో కళాకారులు రాజారావు దర్శకత్వంలో తయారైనవారే అని అన్నారు. కార్యక్రమంలో కళాకారులు ఉమా మహేశ్వరరావు, కరిముల్లా, సురేష్, వనిత, లక్ష్మి, సంధ్య, జూతూరి మంగ తదితరులు పాల్గొన్నారు.

దొంతా నరేష్ మరణం జనసేన పార్టీకి తీరని లోటు

విశాలాంధ్ర-గుంటూరు : జనసేన పార్టీ నాయకుడు, బీసీ యువ నేత దొంతా నరేష్ మరణం జనసేన పార్టీకి తీరని లోటని రాష్ట్ర జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త బోనబోయిన శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రాత్రి అనారోగ్యంతో మరణించిన దొంతా నరేష్ పార్థీవదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పవన్ కల్యాణ్‌పై గుండెల నిండా ప్రేమను నింపుకోవటమే కాకుండా ఆయన భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లటంలో నరేష్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర రావు, కొర్రపాటి నాగేశ్వరరావు, అడపా మాణిక్యాలరావు, నారదాసు ప్రసాద్, ఆళ్ళహరి, దాసరి వాసు, బండారు రవీంద్ర, నందూరి స్వామి, సుబ్బారావు తదితరులున్నారు.

తురకపాలెం ఉర్దూ పాఠశాలను తనిఖీ: డీఐ

విశాలాంధ్ర-మేడికొండూరు : మండలంలోని తురకపాలెం మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసిం సోమవారం తనిఖీ చేశారు.విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించి, పాఠశాల రికార్డులు పరిశీలించారు. విద్యార్థులు ఫార్మెటివ్ పరీక్షలో సాధించిన మార్కులను సమీక్షించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

అదనపు కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న రాజ్యలక్ష్మి



విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా కె.రాజ్యలక్ష్మి సోమవారం బాధ్యతలు తీసుకు న్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్ల బదిలీలో మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వీసీగా విధుల్లో ఉన్న రాజ్యలక్ష్మిను గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. జీఎంసీ అదనపు కమిషనర్‌గా విధుల్లో ఉన్నలక్ష్మి శివజ్యోతి ఓఎస్‌జిసి, ఆర్‌ఓ, గోపాలపురంకుబదిలీ అయ్యారు. సోమవారం రాజ్యలక్ష్మి నగర కమిషనర్ కీర్తి చేకూరిని కమిషనర్ చాంబర్‌లో కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందించి విధుల్లో చేరారు.

డీఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన పెద్ది రోజా

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లా రెవెన్యూ అధికారిణి, అదనపుజిల్లా మేజిస్ట్రేట్‌గా పెద్ది రోజా సోమవారం ఉదయం కలక్టరేట్‌లోని డీఆర్‌ఓ ఛాంబర్ నందు పదవీ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారిని డీఆర్వో గౌరవ సూచకంగా కలసిపుష్పగుచ్చాలు అందించారు.

ప్రజాకంఠక ప్రభుత్వాలను గద్దెదింపుదాం

– సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు : కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ప్రజాకంఠక పాలన సాగిస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. అధిక ధరల భారాలతో, ఎన్నికల హామీలను అమలు పరచక ప్రజా విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయాయని, ఈ విధమైన ప్రజా వ్యతిరేక పాలకులను గద్దెదింపుదామని ఆయన పిలుపునిచ్చారు. గుంటూరు నగరంలోని 30వ డివిజన్ ఏటీ అగ్రహారం ప్రాంతంలోని కమ్యూనిస్టు కాలనీ శాఖ సమావేశం ఆదివారం రాత్రి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ భారతదేశం లౌకిక, ప్రజాస్వామ్య దేశమని మరిచిపోయి మెజారిటీ మతానికి వత్తాసు పలుకుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం చేసిన ప్రజా వ్యతిరేక పనులన్నీ దేవుడు పేరుతో, గుడి పేరుతో రూపుమాపే ప్రయత్నం చేస్తున్నాడని మండి పడ్డారు. ఈ హేయమైన చర్యలను దేశ ప్రజలు గమనిస్తున్నారని, ఇక ఇటువంటి సాగవని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజలపై ఎనలేని భారాలు మోపిన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నేడు 'సిద్ధం' పేరుతో రాష్ట్రంలో బహిరంగ సభలు నిర్వహిస్తున్నాడని, కానీ రాష్ట్ర ప్రజలు జగన్‌మోహన్ రెడ్డిని గద్దెదింపేం దుకు సంసిద్ధం అయ్యారని అన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ ఏటీ అగ్రహారంలోని కమ్యూనిస్టు కాలనీ శాఖ స్థానిక సమస్యలపై పోరాటాలు నిర్వహించి స్థానిక ప్రజల మన్ననలు చురగొన్నాలన్నారు. పార్టీ నిర్వహించే కార్యక్రమాలలో పెద్దఎత్తున పాల్గొనాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో నగర సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, కమిటీ సభ్యులు ఆకిటి అరుణ్‌కుమార్, మంగా శ్రీనివాస్, ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు రాంప్రసాద్, స్థానిక పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

కార్యదర్శి రెడ్డయ్య(చిన్న),

సహాయ కార్యదర్శి శ్రీనివాస్

నూతన నాయకత్వం ఎన్నిక: కమ్యూనిస్టు కాలనీ శాఖ మాజీ కార్యదర్శి మూరబోయిన వెంకటేశ్వర్లు మరణించడంతో శాఖకు నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రెడ్డయ్య(చిన్న), సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇదే నా చివరి ప్రసంగం

– పార్లమెంట్‌లో ఎంపీ గల్లా జయదేవ్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఇదే నా చివరి ప్రసంగమని వివిధ కారణాల వల్ల వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయటం లేదని, ప్రజా జీవితంలో ఉండి పారిశ్రామికవేత్తగా కొనసాగడం అంత సులభం కాదని గ్రహించాను. కాబట్టి నా రాజకీయ జీవితానికి విరామం ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ, దేశానికి సేవ చేయాలనే నా నిబద్ధత, సంకల్పం స్థిరంగా ఉంది. నా సంస్థల ద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని భావిస్తున్నాను. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను సృష్టించడం, దేశానికి ఆదాయాన్ని, సంపదను సృష్టించడం అనేక సంక్షేమ చర్యల ద్వారా ఇతర రూపంలో దేశానికి సేవ చేస్తానని పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గుంటూరు పార్లమెంట్ సభ్యులు గల్లా జయదేవ్ లోకసభలో మాట్లాడారు. తన కుటుంబ రాజకీయ నేపథ్యాన్ని, ఆయన రాజకీయాలలోకి వచ్చిన విధానాన్ని తెలియజేశారు. పార్లమెంట్ సభ్యుడిగా రెండుసార్లు అవకాశం ఇచ్చిన చంద్రబాబు నాయుడుకి, గెలిపించిన గుంటూరు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. లోక్‌సభ స్పీకర్, సభ్యులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అమరావతి అభివృద్ధికి రూ.1500 కోట్లు, గుంటూరు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు రూ.1000 కోట్లు నిధులు సాధించాను. గుంటూరు లోక్‌సభ పరిధిలో దాదాపు 20వేల గృహాలు మంజూరు చేయబడ్డాయి. రాజధాని అమరావతి ప్రాంత 29 గ్రామాల రైతులకు పన్ను మినహాయింపు పొందడంలో విజయం సాధించాను. విభజన హామీలు, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలు ఇంకా నెరవేరలేదని, ఈ సభలోనే హామీ ఇచ్చిన ఈ పవిత్రమైన వాగ్దానాలు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అమలు చేయాలని కోరారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడం ఎన్నికల సంఘం ప్రధాన విధి. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందన్నారు. ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించే విషయంలో ఈసీ ఇచ్చిన ఆదేశాలను డీఆర్‌ఓలు, స్థానిక సిబ్బంది ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు.

ప్రమాద క్షతగాత్రులను హాస్పిటల్స్‌కు చేర్చితే రూ.5వేలు నగదు బహుమతి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే గంట(గోల్డెన్ అవర్)లోపు బాధితులకు సరైన వైద్య చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చని గుంటూరు ఉపరవాణా కమిషనర్ షేక్.కరీం పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవా లలో భాగంగా గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)హాస్పిటల్, ప్రైవేట్ హాస్పిటల్స్ నందు జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, రవాణా శాఖ సిబ్బందితో కలిసి షేక్.కరీం గుడ్ సమ్మరిటన్ పోస్టర్లు సోమవారం ఆవిష్కరించారు. సెయింట్ జోసెఫ్ హాస్పి టల్, రమేష్ హాస్పిటల్, వికాస్ హాస్పిటల్స్ నందు కూడా గుడ్ సమ్మరిటన్ పోస్టర్లలను ఆవిష్కరించారు. కరీం మాట్లాడుతూ రహదారి ప్రమాదం బారినపడ్డ క్షతగాత్రులను నిస్వార్థంగా స్వచ్ఛందంగా సహాయం అందించి దగ్గరలోని హాస్పిటల్స్‌కు చేర్చడమే గుడ్ సమ్మరిటన్ ముఖ్యమని తెలిపారు. యాక్సిడెంట్లకు గురైన క్షతగాత్రులను గంట సమయం లోపు ఆసు పత్రికి చేరవేసిన వ్యక్తికి ప్రభుత్వం నుంచి రూ.5వేలు నగదు బహుమతి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓ ఎస్.గోపాల్, మోటార్ వాహన తనిఖీ అధికారులు ఎం.మల్లీశ్వరి, జి.సౌజన్య, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.3కోట్ల వ్యయంతో ఆధునీకరణ పనులకు శంఖు స్థాపన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గత ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసిందని, జన్మభూమి కమిటీలు వేసి ప్రజలను నిలువునా మోసం చేసిన ఘనత చంద్రబాబు నాయుడుదని ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా విమర్శించారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామం నుంచి జిల్లా వరకు.. జిల్లా నుంచి రాష్ట్రం వరకు అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని తెలిపారు. ఎమ్మెల్యే ముస్తఫా, ఎమ్మెల్యే అభ్యర్థి నూరి ఫాతిమా సోమవారం తూర్పు నియోజకవర్గంలోని 8వార్డు పాత గుంటూరు నందివెలుగు రోడ్డుకు 3కోట్ల వ్యయంతో ఆధునీకరణ అభివృద్ధి పనులకు శంఖు స్థాపన చేశారు. ఈ సందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుందని తెలిపారు. గత ప్రభుత్వాలు కమిషన్స్‌కు కక్కుర్తిపడి అడ్డదిడ్డంగా తవ్వి వదిలేసిన రోడ్లను తమ ప్రభుత్వంలో పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర్ కమిషనర్ కీర్తీ చేకూరి, నగర్ మేయర్ కావటి మనోహర్ నాయుడు, .వైసీపీ కార్పొరేటర్లు, వార్డు ఇన్‌ఛార్జ్‌లు, వార్డ్ ప్రెసిడెంట్లు, వివిధ శాఖల చైర్మన్లు, డైరెక్టర్లు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్ సర్జరీతో నూరుశాతం ఫలితాలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలలో రానున్న కాలంలో రోబోటిక్ పాత్ర చాలా కీలకం కానుందని, సర్జరీలో నూరుశాతం ఫలితాలు సాధించవచ్చని ప్రముఖ జాయింట్ నీ రీప్లేస్‌మెంట్ చీఫ్ సర్జన్, సాయి భాస్కర్ మల్టీస్పెషల్టి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం కొంతమేర ఈ సర్జరీ ఖర్చుతో కూడుకున్నదైనప్పటికీ రోగికి అన్ని విధాలా అనుకూలతలను తెచ్చిపెడుతుందని తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక అరండల్‌పేటలో ఉన్న సాయి భాస్కర్ హాస్పిటల్ ప్రాంగణంలో కీళ్ల మార్పిడిలో రోబో పని తీరును విలేకరుల సమావేశంలో ప్రత్యక్షంగా వివరించారు. డాక్టర్ నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలలో దొర్లే చిన్నపాటి మానవ తప్పిదాలను సైతం నూరు శాతం సరి చేసి రోగికి పూర్వ స్థితి వచ్చే వెసులుబాటు కల్పిస్తుందని చెప్పారు. ఇప్పటి వరకు 150కి పైగా సర్జరీలు నిర్వహించగా నూరు శాతం ఫలితాలు వచ్చా యని, కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు రోగులకు అందుబాటులోకి తీసుకురావడంలో సాయి భాస్కర్ ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటుందని డాక్టర్ నరేంద్ర రెడ్డి పేర్కొన్నారు. రోబోటిక్ సర్జరీ చేయించుకున్న రోగులు తమ అనుభవాలను వివరించారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ మర్రెడ్డి శివారెడ్డి. డాక్టర్ కొనకళ్ళ శ్రీనివాస్, డాక్టర్ ఎరగూటి సాంబ శివారెడ్డి, పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితులను అధిగమించే విధానాలపై మోక్ డ్రిల్

విశాలాంధ్ర-మేడికొండూరు : కెమికల్ డిజాస్టర్ మీద జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివకుమార్ రెడ్డి పర్యవేక్షణలో ఎన్‌డీఆర్‌ఎఫ్(నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందంతో స్థానిక జోసిల్ కంపెనీలో సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం, సంబంధిత శాఖలు, జిల్లా ఫైర్ ఆఫీసర్, సిబ్బంది, మండల రెవిన్యూ సిబ్బంది, మండల పోలీసు సిబ్బంది, మండల ఆరోగ్య మిత్ర ఆపదమిత్రలు ఆధ్వర్యంలో నిష్ణాతులైన నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ అత్యాధునికమైన పరికరాలను ఉపయోగించి అత్యవసర పరిస్థితిని ఎలా అధిగమించాలో తెలియజేసే మాక్ డ్రిల్ ప్రోగ్రామ్‌ను క్లోరిన్ గ్యాస్ లీక్ అవుతున్నప్పుడు ఏ విధంగా ఆ పరిస్థితిని అధిగమించాలో ప్రాక్టికల్‌గా చూపించారు. జోసిల్ ఫ్యాక్టరీ సిబ్బంది చేత కూడా ప్రాక్టికల్ చేయించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీధర్ బాబు, ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండెంట్ భూపేంద్రకుమార్, భద్రతా అధికారి సుజిత్ గోప్, ప్రొడక్షన్ అడ్వైసర్స్ రామినేని బెనర్జీ బాబు, యడ్లపాటి భానుప్రసాద్, ఫ్యాక్టరీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో సర్పంచ్‌లు

విశాలాంధ్ర-తాడికొండ : దీర్ఘకాలికంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం చలో అసెంబ్లీకి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు ముప్పాళ్ళ మనోహర్‌ను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. అలాగే తాడికొండ సర్పంచ్ తోకల సరోజిని, లాం సర్పంచ్ షేక్ ఆబిదా అలీని హౌస్ అరెస్ట్ చేశారు. వారికి నోటీసులు అందజేశారు.

వచ్చే సాధారణ, అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంలు వద్దు

– సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు : రాబోయే సాధారణ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓటు వేయడానికి ఈవిఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్‌ను ప్రవేశ పెట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో 'భారత్ బచావో ఆధ్వర్యంలో 'ఈవీఎంలు వద్దు బ్యాలెట్ ముద్దు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భారత్ బచావో ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా నవజ్యోతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ బిజెపి కూటమి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఓటరు అభిమతానికి భిన్నంగా ఈవీఎంలతో అక్రమాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన అగ్రదేశాలన్నీ ఎన్నికల్లో బ్యాలెట్‌నే వాడుతుంటే భారత దేశంలో ఈవీఎంలను వాడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఇప్పటికైనా దేశంలోని అన్ని పార్టీలు, పౌర, ప్రజా సంఘాలు ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ పేపర్‌నే తీసుకురావాలని పెద్ద ఎత్తున ఉద్యమించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు చిరతనగర్ల వాసు, మేలుకో ఆంధ్రప్రదేశ్ నాయకులు ప్రత్యూష సుబ్బారావు, అవాజ్ నాయకుడు చిష్టి, భీమ్‌సేన సేవాదళ్ నాయకులు నల్లపు నీలాంబరం, సామాజిక కార్యకర్త ఎస్.బ్రహ్మయ్య, న్యాయవాదులు సురేష్, పలుకూరి ప్రసాద్, దళిత మహాసభ నాయకులు కొరబండి ఆంథోనీ, భీమ్ భారత్ నాయకులు పాగళ్ల ప్రకాష్, ముస్లిం హక్కుల పోరాట సమితి నాయకులు షేక్ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

షర్మిలకు భద్రత తగ్గించి... భయపెట్టాలని చూస్తారా?

విశాలాంధ్ర-గుంటూరు : వైఎస్ షర్మిలమ్మ కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటి నుంచి జగన్‌మోహన్ రెడ్డికి భయం పట్టుకుందని, ఎలాగైనా షర్మిలమ్మను కట్టడి చేయాలని ఆమెకు భద్రత తగ్గించి పరోక్షంగా భయపెట్టాలని చూస్తున్నారని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి అన్నారు. వైఎస్ షర్మిల రెడ్డి భద్రతను కుదించి జగన్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కక్ష సాధింపు చర్యను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గుంటూరు హిమని సెంటర్ గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న షర్మిలమ్మకు సమాధానం చెప్పలేని పిరికి పంద జగన్‌మోహన్ రెడ్డి అని విమర్శించారు. ఒక మహిళా అని కూడా చూడకుండా పనిగట్టుకుని సోషల్ మీడియాలో వైసీపీ నాయకులు అసభ్య పద జాలంతో పోస్టులు పెడుతుంటే కట్టడి చేయాల్సిన జగనన్న చోద్యం చేస్తున్నారని, ఇది అతని చేతకాని తనానికి నిదర్శనమన్నారు. తక్షణమే సోషల్ మీడియా నిందితులను అరెస్టు చేసి శిక్షించాలని, షర్మిలమ్మకు భద్రతను పెంచాలని మస్తాన్ వలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వర రావు, నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్, మద్దిరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి, వణుకూరి శ్రీనివాస్‌రెడ్డి, నూనె పవన్ తేజా, చుక్కా చంద్రపాల్, గద్దం పాల్ విజయ్ కుమార్, కె.బుజ్జి, మీరావలి, రహమాన్, రామకృష్ణ, షేక్ మస్తాన్, సయ్యద్ జాని తదితరులు పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రలు వంద శాతం మ్రింగించాలి : సంయుక్త కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 9వ తేదీన ఒకటి నుండి 19 సంవత్సరాల వయస్సు గల వారందరికి అల్బెండజోల్ మాత్రలు వంద శాతం మ్రింగించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి లైన్ డిపార్ట్మెంట్ అధికారులకు సూచిం చారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై నిర్వహించిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో సంయుక్త కలెక్టర్ రాజకుమారి, డియం అండ్ హెచ్ ఓ డా.విజయ లక్ష్మీ , ఆర్‌బిఎస్‌కె కో ఆర్డినేటర్ డా.శ్రావణ బాబు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు స్వాతి, లక్ష్మీ కుమారి, రవీంద్ర రావులతో కలసి పాల్గొన్నారు. సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 9వ తేదీన అంగన్ వాడీ, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ స్కూల్స్, జూనియర్ కాలేజీలోని 4,72,534 మంది అల్బెండజోల్ మాత్రలు వంద శాతం తీసుకునేటట్లు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి ఏడాది ఫిబ్రవరి, ఆగష్టు మాసాలలో రెండు దఫాలుగా నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు మ్రింగిస్తున్నట్లు తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో కృషి చేయాలని కోరారు. ఆర్‌బిఎస్‌కె కో ఆర్డినేటర్ డా. శ్రావణ బాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నులిపురుగుల నిర్మూలన ఆవశ్యకతపై వివరించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు పట్టని తత్వమే నీతిమాలిన రాజకీయాలకు కారణం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తమ సొంత రాజకీయ మనుగడ కోసం తాను కట్టుబడి ఉండవలసిన విలువలను.. సిద్ధాంతాలను మర్చిపోయి దిగజారుతున్న నేటి నాయకుల వ్యవహార శైలికి ప్రజలకు పట్టని తత్వమే కారణమని విద్యావేత్త, విశ్లేషకులు ఇ.చంద్రయ్య అన్నారు. స్థానిక అవగా హన సంస్థ కార్యాలయంలో 'శోచనీయమైన-దురదృష్టకరమైన నేటి పిల్లిమొగ్గల రాజకీయాలు'అనే అంశంపై మంగళవారం చర్చ జరిగింది. చంద్రయ్య మాట్లాడుతూ ప్రజాసేవ కంటే నమ్మిన సిద్ధాంతాల పట్ల నిబద్ధత కంటే తమ ప్రయోజనాలకు సంపాదనకు ప్రాధాన్యత ఇస్తూ పార్టీలను మారుస్తున్న ప్రజాప్రతినిధులను నాయకులకు ఓటర్లు శిక్ష విధించే పరిస్థితి నేడు లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అయితే మనదేశంలో నాయకులు వారి నేర్పరితనం, రకరకాల ప్రభావాలతో తమ దూకుళ్ళకు మద్దతు కూడాగడతారని, చావనైనా చస్తానుగానీ పార్టీ మారను అన్న వారు వెంటనే పార్టీ మారటం.. వారిని ఎట్టి పరిస్థితుల్లో మా పార్టీలో చేర్చుకోం అన్న నాయకులే వారిని చేర్చుకోవటం ప్రస్తుతం జరుగుతుందని దుయ్యబట్టారు. ఈ చర్చలో శివరామిరెడ్డి, సుబ్బారెడ్డి, బసవగుప్తా తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ఆటంకంగా ఎమ్మెల్యే ముస్తఫా

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ముస్తఫా ఆటంకంగా మారారని గుంటూరు తూర్పు టీడీపీ ఇన్‌చార్జ్ మొహమ్మద్ నసీర్ ఆరోపించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గుంటూరు తూర్పు నియోజకవర్గం 11వ డివిజన్ ఆనందపేట గౌలుసు కొండల్ నగర్‌లో ఇంటింటికి తిరుగుతూ తెలుగుదేశం-జనసేన పార్టీలు అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ రెండు పర్యాలు ఎమ్మెల్యేగా గెలిచిన ముస్తఫా నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏ రోజు పనిచేయలేదని, తన వ్యక్తిగత ప్రయోజనాలు, కమీషన్లకు కక్కుర్తిపడి దాచుకోవడం దోచుకోవడమే లక్ష్యంగా చేసుకున్నారని విమర్శించారు. టీడీపీతో సంబంధంలేని వారిని తన పార్టీలో చేర్చుకుంటున్నానంటూ చేస్తున్న అబద్ధపు ప్రచారాలు ఆపాలని, లేకపోతే ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఉస్మాన్, పఠాన్ జమీర్, ముజీబ్, దేవా, గాలి శంకర్, చిన్న జానీ, ఇలియాజ్, నాగ మల్లిక, సల్మా, జానీ, జిలాని తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షలు

– జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో జేసీ రాజకుమారి

విశాలాంధ్ర బ్యూరో-గుంటూరు : మార్చి 1వ తేది నుంచి 20వ తేది వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలను ప్రశాంతంగా, పకడ్బందిగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. కలక్టరేట్ లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని సంయుక్త కలెక్టర్ రాజకుమారి, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డు ఆర్ఐఓ జీకే జుబర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీ కుమారి, కె.స్వాతి, రవీంద్రరావులతో కలసి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ నెల 11వ తేది నుంచి 20వ తేది వరకు జరిగే ఇంటర్మీ డియట్ రెండవ సంవత్సరం ప్రాక్టికల్స్ పరీక్షలకు 113 పరీక్షా కేంద్రాలలో 24,334 మంది అభ్యర్థులు, మొదటి, రెండవ సంవత్స రానికి సంబంధించి ఒకేషనల్ ప్రాక్టికల్స్ పరీక్షలకు 2,042 మంది అభ్యర్థులు 11 పరీక్షా కేంద్రాల్లో ఈ నెల 5 నుంచి 20వ తేది వరకు మూడు దఫాలుగా పరీక్షలకు హాజరు అవుతున్నట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. ఏ కళాశాలకు సంబంధించి ఆ కళాశాలలోనే ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, థియరీ పరీక్షలకు జంబ్లింగ్ విధానం ఉంటుందని వివరిం చారు. జిల్లాలో నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ టీములను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాన్ని ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసి పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థు లకు ఇవ్వడం జరుగుతుందని, విద్యుచ్ఛక్తికి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, వేసవి నేపథ్యంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుచ్ఛక్తి అధికారులకు సూచించారు. సమావేశంలో పీడీ డీఆర్డీఏ హరిహరనాథ్, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణు గోపాల్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఎస్ఈ సురేష్, డీఈఓ శైలజ, డీఎస్ఓ కోమలి పద్మ, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ,పీడీ ఐసీడీఎస్ ఉమాదేవి, ఏడీ చేనేత జౌళిశాఖ వనజా పాల్గొన్నారు.

ఎన్నికల షెడ్యూల్డ్‌కు ముందే అమలు చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఎన్నికలకు ముందు ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నేటి వరకు ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదని, ఈ నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్డ్‌కు ముందే ఆ హామీలను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఎ) గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గుంటూరు మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఏపీ జీఈఎ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సయ్యద్ చాంద్‌బాషా మాట్లాడారు. సీపీఎస్ రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమ బద్ధీకరణ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సుప్రీంకోర్టు జడ్జిమెంట్ అమలు చేయకపోగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వలేదని దుయ్యబట్టారు. ఉద్యోగులకు 12వ పీఆర్సీ అమలు చేయకపోయినా కనీసం ఐఆర్ అయినా ప్రకటించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు నగదు రహిత వైద్యాన్ని అందించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు కూడా నేటికి అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మురళీ కార్తీక్, నగర్‌శాఖ అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, నగరశాఖ ఉపాధ్యక్షులు బి.శ్రీనివాస రెడ్డి, నగర శాఖ సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి ఏఆర్ఎస్ సిద్ధం

విశాలాంధ్ర-తాడికొండ : అధికారం కొన్ని వర్గాలకే కాదు అన్ని వర్గాలకు దక్కాలి. రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలి. అన్ని ప్రాంతాలు అభివృద్ధి లక్ష్యంగా ఆంధ్ర రాష్ట్ర సమితి ఏర్పడిందని ఏఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు తెలిపారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సామాజిక న్యాయమే ఎజెండాగా ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేది నుంచి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, అనంత పురం, కడప, కర్నూలు జిల్లాలలో నెలరోజుల పాటు ఎన్నికల ప్రచారానికి వెళ్ళనున్నారు. రెండో విడత కృష్ణ, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో ఎన్నికల ప్రచారం కొనసాగుతోంది. అన్ని వర్గాలను కలుపుకుపోయే పార్టీగా తమ పార్టీ ఉంటుందని కోటేశ్వరరావు తెలియజేశారు. ఈ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఫిర్యాదులను హేతుబద్ధంగా పరిష్కరించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్పందనలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులు నిర్ణీత గడువులోపు హేతుబద్ధంగా పరిష్కరించాలని జిల్లా అధికారులను జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ రాజ కుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కే.స్వాతి, లక్ష్మీ కుమారి, రవీంద్రరావు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 220 అర్జీలను స్వీకరించారు.

స్పందనకు 40 ఫిర్యాదులు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్పందనకు అందే ఫిర్యాదులు, అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కారం జరిగేలా విభాగాధిపతులు, నోడల్ అధికారులు చొరవ చూపాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో స్పందన నిర్వహించారు. నగరంలోనలి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 40 ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో జీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట మృతదేహంతో ధర్నా



విశాలాంధ్ర-చేబ్రోలు : చేబ్రోలు పోలీస్‌స్టేషన్ ఎదుట మృతదేహంతో బంధువులు జీబీసీ రోడ్డుపై ధర్నా నిర్వహించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు మోదుకూరు గ్రామానికి చెందిన చల్లపల్లి విజయ్(25) గుంటూరులో కార్ల షాపులో మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం గుంటూరు నుంచి మోతుకూరు వెళుతున్న సమయంలో చేబ్రోలు సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతికి కారణమైన కారు డ్రైవరు, లారీ డ్రైవర్ల అరెస్టు విషయంలో నెలకొన్న వివాదంపై మృతుని బంధువులు సోమవారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్ ఎదుట జీబీసీ రోడ్డుపై ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ జనార్ధన్ రావు, చేబ్రోలు తహశీల్దార్ గోపాలకృష్ణ సంఘటనా స్థలానికి వచ్చి విజయ్ కుటుంబ సభ్యులతో చర్చించి ధర్నా నిలువరించారు.

ఎన్నికల యుద్ధానికి సిద్ధం

విశాలాంధ్ర-పొన్నూరు: సీఎం జగన్ మోహన్ రెడ్డి పాలనలో పొన్నూరు నియోజకవర్గంలో రూ.1600ల కోట్ల నిధులు ఖర్చు చేసి అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలు చేశామని వైసీపీ నాయకుడు కోట శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పొన్నూరు వైసిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలు ఎన్నికుయుక్తులు పన్నిన రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఎన్నికల సమరానికి సిద్ధంగా ఉందన్నారు.

CHANGE OF NAME

I, CHITIRALA SRINIVAS RAO (Old Name), S/o. CHITIRALA MANGAPATHI RAO, R/o. Door No.82-3-258/1, Sampath Nagar 2nd Lane, Near Sivalayam Temple, Guntur, Guntur District - 522004, Andhra Pradesh, have changed my name to **CHITIRALA SRINIVASA RAO.** Hereafter my name is known as **CHITIRALA SRINIVASA RAO.**

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

టీడీపీ నాయకులకు సమగ్ర శిక్షణ

విశాలాంధ్ర-వినుకొండ: తిమ్మాయపాలెం రోడ్‌లోని వై కన్వెన్షన్ హాల్ నందు సోమవారం నిర్వహించిన నియోజకవర్గ తెదేపా శ్రేణులకు జరిగిన సమగ్ర శిక్షణ కార్యక్రమంలో పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా ప్రజలతో ఏ విధంగా మమేకం అవ్వాలి, ఓటర్ల జాబితా పరిశీలన, బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ తదితర కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా సమాయత్తం కావాలని చెప్పారు.ప్రస్తుత సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా పార్టీ నాయకులు, కార్యకర్తలను చైతన్యం చేసేందుకు, వారిలో అవగాహన కల్పించేందుకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ, ఓటు ఫర్ తెదేపా కార్యక్రమాలపై ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి జాబితాలోని లోటుపాట్లను పరిశీలించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో పార్టీ పరంగా ప్రచారాలు, పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లడం లక్ష్యంగా చేసుకుని శ్రేణులంతా శ్రమించాలని కోరారు. బూత్ కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు గ్రామ, మండల కమిటీలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. బాగా పనిచేసిన తెదేపా నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులను అభినందించారు. నమ్మించి తడిబట్టతో గొంతులుకోసే అలాంటి మనస్తత్వం ఉన్న వ్యక్తికి అధికారం ఇచ్చి రాష్ట్ర ప్రజలు కూడా అన్ని విధాలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ ఆయా మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు,కార్యకర్తలు మరియు మహిళలు పాల్గొన్నారు.

శావల్యాపురం ఎస్సైగా సురేష్

విశాలాంధ్ర-శావల్యాపురం: శావల్యాపురం మండల ఎస్ఐగా చల్లా సురేష్ స్థానిక పోలీస్ స్టేషన్ నందు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సురేష్ చిలకలూరిపేట పట్టణ ఎస్సైగా విధులు నిర్వహిస్తూ సాదారణ ఎన్నికల బదీలీలలో బాగంగా శావల్యాపురం మండలానికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విదులు నిర్వహిస్తున్న తుళ్ళూరి తిరుపతిరావును ఎస్బి స్పెషల్ బ్రాంచికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఎస్సై సురేష్‌ని సిబ్బంది సాదరంగా ఆహ్వానించి, పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెపారు. అనంతరం ఎస్సై సురేష్ విలేకరులతో మాట్లాడుతూ అక్రమ మద్యం, జూదం, రోడ్డు ప్రమాదాలు వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తారని తెలిపారు.

వల్లభ డైయిరీ పార్లర్ ప్రారంభం

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : పట్టణం పరిధిలోని జానపాడు సమీపంలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ప్రాంతంలో సోమవారం వల్లభ డెయిరీ పార్లర్ నూతన ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వల్లభ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ బొల్లా గిరిబాబు హాజరై రిబ్బన్ కట్ చేసి పార్లర్ ప్రారంభించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నాణ్యమైన వల్లభ పాలు, పాల ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులో ఉండేలా అవుట్‌లెట్స్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం డైరెక్టర్ రామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నా టక, తమిళనాడు రాష్టాలలో ప్రతి రోజు రెండు లక్షల యాభై వేల లీటర్లు వినియోగదారులకు అందిస్తున్నామని, సంవత్సరానికి ఐదు వందల కోట్ల లీటర్ల టోర్నోవర్ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యకామంలో సేల్స్ మేనేజర్ పి.శ్రీనివాసరావు, తిరుమల ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ఏఓ అంజిబాబు పాల్గొన్నారు.

వినుకొండ నూతన తహసీల్దార్ గా ఇ.బ్రహ్మయ్య

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ నూతన తహసీల్దార్‌గా ఇ.బ్రహ్మయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు బాపట్ల జిల్లా ఇంకొల్లు నుంచి వినుకొండ బదిలీ ఆయన తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం అయ్యారు.

వీఆర్ఏల మండల అధ్యక్షుడుగా వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర-దుర్గి: దుర్గి మండలం అడిగోప్పల గ్రామానికి చెందిన విఆర్ఏ లంజపల్లి వెంకటేశ్వర్లు మండల విఆర్ఏల అధ్యక్షుడు గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల విఆర్ఏల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా షేక్ మస్తాన్ వలి (ధర్మవరం), కార్యదర్శిగా కరీముల్లా మరి కొంతమంది కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. ఈసమావేశంలో మొత్తం 27 మంది విఆర్ఏలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతపై ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర-కారంపూడి: వేమన పద్యాలులో ఆత్మ జ్ఞానమే ఉంది, నీతి వాక్యాలు కావు అని త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక నరసారావు పేట కమిటీ ఇంటింటి ప్రచారాన్ని సోమవారం మండలంలోని పెద్ద కొదమగుండ్ల, చిన్న కొదమ గుండ్ల, కాకనివారిపాలెం, రెడ్డిపాలెం, బ్రహ్మనాయునిపాలెం, భట్టువారిపాలెం గ్రామాలలో నిర్వహించారు. ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ ఆధ్యాత్మికతను అవగాహన కల్పించి దేవాలయములలోని రహస్యములను, హిందుత్వములోని సాంప్రదాయ ములను, మనపండుగల ఆచరణలోని జ్ఞానార్ధములను, వేమన భగవాన్ పద్యాలలోని జ్ఞానంను తెలియజేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు ఘడియం పెద్దరెడ్డి, సభ్యులు ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, చల్లగుండ్ల భాస్కరరావు, కాటం పోతురాజు, కుంచాల చిన్నవెంకయ్య, కోవూరి చిన్న వెంకటేశ్వర్లు, పగడాల అశోక్, తవిటి అమరలింగయ్య, వెచ్చా రాజశేఖర్ తదితర సభ్యులు ప్రచారంలో పాల్గొన్నారు.

డీఎస్పీగా రవికాంత్ బాధ్యతలు

విశాలాంధ్ర-మంగళగిరి: మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీగా సీహెచ్ రవికాంత్ బదిలీపై వచ్చారు. గతంలో ఆయన విజయవాడ నగర డీఎస్పీగా విధులు నిర్వహించారు. తాజాగా సోమవారం తెనాలి రోడ్డు లోని డిఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. మంగళగిరి, తాడేపల్లి, పెదకాకాని పోలీస్ అధికారులు, సిబ్బంది కలిసి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. డీఎస్పీ ని కలిసిన వారిలో మంగళగిరి పట్టణ సీఐ ఎం శ్రీనివాసరావు, రూరల్ సీఐ వెంకట్రావ్, తాడేపల్లి సీఐ మధుసూదన్ రావు, మంగళగిరి పట్టణ ఎస్సై మహేంద్రా, రూరల్ ఎస్సై క్రాంతి కిరణ్, ట్రాఫిక్ సీఐ బి. బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

ఎక్సలెన్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో వీరస్థలి

విశాలాంధ్ర-తెనాలి : సుజాత ఆర్ట్ పిక్చర్స్ బ్యానర్‌పై గల్లా జ్ఞానశేఖర్ నిర్మాతగా, సహజకవి అయినాల మల్లేశ్వరరావు స్టోరీ రైటర్‌గా, వరల్డ్ రికార్డ్ హోల్డర్, సీనియర్ జర్నలిస్ట్ కనపర్తి రత్నాకర్ దర్శకత్వంలో రూపొందిన దేశభక్తి చిత్రం వీరస్థలి తెనాలి ఎక్సలెన్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకుంది. గతంలో ఇదే చిత్రానికి మిరాకిల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంశాకమంత్రి మేకతోటి సుచరిత మిరాకిల్ అవార్డును చిత్ర దర్శకుడు కనపర్తి రత్నాకర్‌కు అందజేశారు. సోమవారం ఎక్సలెన్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్ దర్శకుడు రత్నాకర్, రైటర్ అయినాల మల్లేశ్వరరావు, నిర్మాత గల్లా జ్ఞానశేఖర్‌లకు నమోదు పత్రాలను, ధృవీకరణ పత్రాలను అందజేశారు. పలువురు ప్రముఖులు వీరస్థలి తెనాలి టీమ్ అభినందించారు. కార్యక్రమంలో వెంకట్, సోమేష్, మధుకర్, అబ్రహం లింకన్, వీరయ్య, కృపానందం, వెంకటేశ్వరరావు, వసంత యామిని పాల్గొన్నారు.

అహంకార పాలనను సాగనంపాలి

విశాలాంధ్ర-వినుకొండ : అదిగో, అహంకార నియంత పాలన చేస్తూ విర్రవీగుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుని రానున్న ఎన్నికల్లో అందరం ఏకమై అహంకార పాలనను పాల ద్రోలి వినుకొండ ప్రజలకు స్వేచ్ఛ కల్పిద్దామని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు తమ అనుచరులతో కలిసి వైసీపీకి రాజీనామా ఇచ్చిన నేపథ్యంలో సోమవారం ఉదయం టీడీపీ అధిష్టానం ఆదేశాల మేరకు. పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మక్కెన కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా మక్కెన, జీవిని ఆయనతో వచ్చిన సీనియర్ నేతలను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇరువర్గాల నేతలు కార్యకర్తలతో కార్యాలయం కిటకిటలాడిపోయింది. ఈ సందర్భంగా జీవి ఆంజనేయులు మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు మక్కెన మల్లికార్జునరావును కలవడం జరిగిందని. ఆయనకు ఎంతో రాజకీయ అనుభవం పాలనా దక్షిత ఉందని. వినుకొండలో జరుగుతున్న దుర్మార్గపు అరాచక పాలనకు బుద్ధి చెప్పేందుకు తమతో కలవాలని ఆహ్వానించారు. అన్ని వర్గాలపై వైసీపీ దాడులు పెరిగి పోయాయి అన్నారు. ఇటీవల కాలంలో స్వల్ప ఘర్షణను ఆసరాగా తీసుకుని. పోలీస్ కాల్పుల వరకు దారి తీయిం చారని జీవి ఆగ్రహించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి జనసేన ఇతర పార్టీలతో కలిసి. మక్కెన అనుభవం కూడగట్టుకొని. బొల్లాకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికల హామీలన్నీ తుంగలో తొక్కిందని, జాబ్ క్యాలెండర్ లేదు. ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు ఎన్నికల హామీలన్నీ విస్మరించి స్వలాభమే చూసుకుంటూ కాలం గడిపారన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ జీవి ఆంజనేయులు రెండు మార్లు ఎమ్మెల్యేగా చేసి నియోజకవర్గ అభివృద్ధి పై మంచి అనుభవం ఉందని రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ పరిణామాలు మారుతున్న నేపథ్యంలో ఆదివారం తాను ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి ఒక నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. మరి కొంతమంది పెద్దలతో కలిసి ఒక నిర్ణయం తీసుకుంటామని హామీఇచ్చారు. కాగా ప్రస్తుతం వినుకొండలో అహంకార నియంతృత్వ పాలన జరుగుతున్నదని, గత 30 ఏళ్ల క్రితం పోలీస్ కాల్పులు జరగా, మరలా ఇటీవల వినుకొండలో పోలీసు కాల్పులు జరగటం దురదృష్టకర మన్నారు. గత 50 ఏళ్లుగా ఎంతమంది ఎమ్మెల్యేలుగా గెలిచి పట్టణంలో ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ప్రశాంతమైన పాలన కొనసాగించారని, కాగా నేడు ఆ పరిస్థితి లేదని, అహంకార పాలనను సాగనంపి అందరం కలిసి గౌరవప్రదమైన రాజకీయాలు చేసుకుంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని మక్కెన తెలిపారు.

రైతాంగ సమస్యల సాధనకు 8న కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన

విశాలాంధ్ర-చిలకలూరిపేట: వైసీపీ ప్రభుత్వం రైతుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు ఆరోపించారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంట చేతికందిన సమయంలో మిగ్ జాం తుపాను నిండా ముంచేసిందని, ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తుందని మండి పడ్డారు. తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకి రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, చేతకానితనం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.2లక్షల వరకు వ్యవసాయ రుణాలు రద్దు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న కేంద్ర కార్మిక, రైతు సంఘాలు నిర్వహించ తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మె గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైతుల సమస్యల సాధన కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ నెల 8వ తేదీ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన నిర్వహిస్తున్నట్లు, ఈ కార్యక్రమంలో రైతులు, రైతు కూలీలు, ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వినుకొండ పట్టణంలో 100 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరిక

విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ పట్టణంలోని 15,16,19,మరియు 20 వార్డుల నుండి అధికార వైసిపిని వీడి 100 కుటుంబాలకు పైగా యూనిటీ ఇన్చార్జ్ రియల్ ఎస్టేట్ జానీ, అరే శ్రీరాములు మరియు వార్డుల తెలుగు దేశం పార్టీ నాయకులు అధ్వర్యంలో సోమవారం రాత్రి పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కృష్ణవంశీ, ఫేక్ నాజర్, షేక్ ఫరీద్, ఎస్.కె సత్తార్, కాసుల రూపేష్,షేక్ కరిముల్లా, షేక్ బాషా, షాజహాన్, తుమ్మ వెంకటేశ్వర్లు, కొడగంటి అజయ్, వెంకట్ ఇంకొల్లు బషీర, పూరిమెట్ల శైదా, దరియా, దొడ్డి జగన్నాథం, చిన్న లక్ష్మయ్య, వెంకటకృష్ణ, రామారావు, సిహెచ్ సుబ్బారావు, వెంకటేశ్వరరావు, పఠాన్ ఖాన్, బెతంచర్ల కృష్ణారావు, నక్క చలం, సాంబశివరావు, పసుమర్తి చిరంజీవి ,రవి కుమారు, గోరంట్ల రామారావు, కత్తి బ్రహ్మయ్య ,జై బాలయ్య, రమేషు, షేక్ ఇబ్రహీం, పూజారి అంజి ,పి రామారావు పూజారి జయంతు జీ.వి ఆంజనేయులు పార్టీ కండువాలతో సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ రోజు రోజుకి టీడీపీకి ఆదరణ పెరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండ లాల్లో చాలా గ్రామాల్లో ప్రజలు టీడీపీలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. కొత్తగా వచ్చే వారిని గౌరవిస్తూ అందరూ కలిసి మెలిసి పార్టీ కోసం పని చేయాల న్నారు. వైసీపీ పార్టీ వచ్చాక ఉద్యోగ అవకాశాలు కోల్పోయారు అన్నారు. రానున్న రోజుల్లో టిడిపి పార్టీ బీసీ ప్రత్యేక చట్టాలు తయారు చేస్తున్నారన్నారు. అదేవిధంగా బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొవాలన్నారు. రాష్ట్ర భవిష్యత్ అక్కర్లేదు అనుకుంటే మరోసారి ప్రజలు తప్పు చేయకూడదు అన్నారు. వెన్నుముక లేని నాయకులను ఎన్నుకుంటే రాష్ట్ర భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. బాధ్యత గల ప్రజాప్రతినిధులు ఎన్నుకోవడం ద్వారా రాష్ట్ర భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చుని అన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరు పాత కొత్త అనే తేడా లేకుండా పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు పాటుపడాలని కోరారు. పార్టీలో చేరడం అత్యంత సంతోషమని వారందరికీ హృదయ పూర్వకంగా ఆహ్వానం పలుకుతున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పఠాన్ అయ్యూబ్ ఖాన్, క్లస్టర్ ఇంచార్జ్ పత్తి పూర్ణచంద్రరావు, సౌదాగర్ జానీ భాష , పివి.సురేష్ బాబు, బొంకూరి రోశయ్య, కళింగ శ్రీనివాసరావు, అజీజ్, బత్తుల వెంకటరావు,గోల్డ్ కరిముల్ల, కొంద్రముట్ల సుభాని, సీనియర్ న్యాయవాదులు నలబోలు రాంకోటేశ్వరరావు, పొట్లూరి సైదారావు, లాయర్ సిద్దయ్య, ముప్పడి చౌడమ్మ, ఫతేపురం గాలయ్య, పారెళ్ళ సుబ్రహ్మణ్యం, మల్లికార్జున, పువ్వాడ వెంకటకృష్ణ,పలువురు టీడీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

చట్టసభలలో బహుజనులకు అవకాశం ఇవ్వాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : 1236 రోజులుగా మందండం నడిబొడ్డున తాళ్ళయపాలెం జంక్షన్‌లో మూడు రాజధానుల కోసం ఉద్యమం జరుగుతోందని సోషల్ డిపార్ట్‌మెంట్ ఫ్రంట్ అధ్యక్షులు మాదిగాని గురునాథం అన్నారు. సోమవారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా మూడు రాజధానుల ఉద్యమం చేశామని అన్నారు. 54 వేల ఇళ్ల గృహాల నిర్మాణం జరగలేదని వాటికి స్టే తీసుకువచ్చారని అన్నారు. డెమోక్రసీ ఇన్ బాలన్స్ పేరుతో స్టేట్ తీసుకొచ్చారని అన్నారు. మూడు రాజధానుల మీద స్టే తీసుకొచ్చారని ఇవన్నీ పరిష్కారం కాలేదని 2024 ఎన్నికల్లో ఏ ప్రభుత్వం వచ్చినప్పటికీ మూడు రాజధానుల ఉద్యమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో బహుజన పరిరక్షణ సమితి నుంచి ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా అవకాశం ఇవ్వాలన్నారు. నేషనల్ దళిత జేఏసీ చైర్మన్ పెరికే వరప్రసాద్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అభివృద్ధి వికేంద్రీకరణ గురించి రాశారో దాని ప్రకారం మూడు రాజధానులు ఏర్పాటు చేస్తే అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఎక్కడ ఎవరిని ఆశించకుండా అభివృద్ధి వికేంద్రీకరణ మూడు రాజధానులు ఇళ్ల పట్టాల విషయంలో ఉద్యమాన్ని చేశామన్నారు. చట్టసభల్లో మేముంటే అభివృద్ధి వికేంద్రీకరణ ఇళ్ల పట్టాల కోసం బహుజనుల పక్షాన మాట్లాడతామన్నారు. చట్టసభలలో బహుజనులకు అవకాశం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి మహిళా నాయకురాలు ఇందుపల్లి సుభాషిని, ఈపూరి ఆదాం, బి.సాంబయ్య, కారుమూరి పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సంఘం 'చలో అసెంబ్లీ'కి అనుమతులు లేవు

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచ్‌లు సంఘం తమ సమస్యల పరిష్కారానికి ఈ నెల 6వ తేదిన తలపెట్టిన 'ఛలో అసెంబ్లీ' కార్యక్రమానికి ఎటువంటి అనుమతులు లేవని జిల్లా ఎస్పీ తుషార్ దూడి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని అసాంఘిక శక్తులు శాంతిభద్రతలకు భంగం కలిగించే అవకాశం ఉన్నందున శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా అనుమతులు లేవని తెలియజేశారు. గుంటూరు జిల్లా తూళ్లూరు సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీసు చట్టం అమలులో ఉందని చెప్పారు. పోలీసుల ఆదేశాలను ధిక్కరించి పాల్గొంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

గరికపాటి రాజారావు ఆశయాలను ముందకు తీసుకెళ్లాలి

విశాలాంధ్ర-అమరావతి: బ్రిటీష్ సామ్రాజ్యవాదుల అరాచకాలను అరికడుతూ దేశ సంపూర్ణ స్వాతంత్రం కోసం సాగుతున్న సమరంలో పాసిస్ట్ వ్యతిరేక ఉద్యమం నుంచి అంతర్జాతీయ కార్మిక వర్గ చైతన్యంతో ప్రజల్ని సమీకరిస్తూ ప్రజా కలల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తూ సాగిన సమరంలో కళాతపస్వి గరికపాటి రాజారావు ఆశయాలను ప్రతి కళాకారుడు ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరా పట్నం రామకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన అమరావతిలొని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండల కార్యాలయంలో ఏర్పాటుచేసిన గరికపాటి రాజారావు 110వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమాజంలో కళాకారులు ఎదుర్కొనే సమస్యల్ని పరిష్కార మార్గం వైపు తీసుకెళ్లేందుకు సమైక్యత భావంతో కళాకారులు ముందుకు సాగాలని రామకృష్ణ కొరారు. కళాకారులు పాదిలి మలేశ్వరరావు, సత్తార్, చద్రమ్మ, సత్యామూర్తి, సత్యం, ఆంజనీయులు, రమయ్య, జి.రాజు తదితరులు పాల్గొని నివాళ్ళర్పించారు.

లలితా హాస్పిటల్‌లో ఈ నెల 29 వరకు 'ఉచిత మెడికల్ క్యాంప్'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా లలితా హాస్పిటల్ నందు ఈ నెల 29వ తేదీ వరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వకు 'ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు' నిర్వహించడం జరుగుతుందని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాఘవ శర్మ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్యాంప్ నందు ఉచితంగా ఆంకాలజీ కన్సల్టేషన్, ఈసీజీ, బీపీ, షుగర్, అల్ట్రాసౌండ్ బ్రెస్ట్, ప్యాప్ స్మియర్ టెస్ట్, ఛాతి ఎక్సరే, బీఎంఐ, డైట్ కౌన్సిలింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వంశపారం పర్యంగా క్యాన్సర్ ఉన్న వారికి..పొగాకు అలవాటు ఉన్న వారికి..శరీరంలో ఎక్కడైన కణితులు ఉన్న వారికి..కారణం లేకుండా బరువు తగ్గుతున్న వారికి..ఆకలిలేకపోవటం..మలబద్ధకం లేదా తరుచూ విరోచనాలు కావటం.. మలంలో లేదా మూత్రంలో రక్తం రావటం..దీర్ఘకాలికంగా దగ్గు లేదా గొంతు బొంగురు పోవటం..రొమ్ములో గడ్డలు..మానని పండ్లు తదితర లక్షణాలు ఉన్న వారికి ఈ క్యాంప్ ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రతి సంవత్సరం కోటి మంది క్యాన్సర్‌తో మరణిస్తున్నారని డాక్టర్ బి.స్రవంతి పేర్కొన్నారు. ఇది హెచ్ఐవీ, ఎయిడ్స్, మలేరియా, క్షయవ్యాధి మరణాలు కంటే ఎక్కువ అని అన్నారు. సరైన అవగాహనతోనే మూడవ వంతు కంటే ఎక్కువ క్యాన్సర్ కేసులను నివారించవచ్చని తెలిపారు. ఈ క్యాంప్‌ను అవసరత ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొదుపు సంఘాల అక్కాచెల్లమ్మలకు బాసటా వైఎస్సార్ ఆసరా

విశాలాంధ్ర-దుర్గి : పొదుపు సంఘాల అక్కాచెల్లమ్మలకు బాసటా వైఎస్సార్ ఆసరా అని ప్రభుత్వ విప్, జిల్లా అధ్యక్షుడు, మాచర్ల శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన 4వ విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని 813 స్వయం సహాయక సంఘాలలోని 8130 మంది సంఘ సభ్యులకు రూ.6.72 కోట్లను నేరుగా వారివారి బ్యాంకు ఖాతాల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డి జమచేయడం జరిగిందన్నారు. డ్వాక్రా రుణాలు రద్దు చేస్తానని చంద్రబాబు నాయుడు చెప్పి అధికారంలోకి వచ్చి రద్దు చేయకుండా మాట తప్పారని ఆరోపించారు. గత ప్రభుత్వాలు, నాయకులు కూడా ఇచ్చిన హామీలు అమలు చేసిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చాక ఇంటికొక్క ఉద్యోగం, లేకపోతే రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాకా చంద్రబాబు నాయుడు ఒక్క ఉద్యోగమైనా ఇచ్చాడా అని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ చేస్తామని చంద్రబాబు మాట తప్పారని, పార్టీలు, మతాలు, కులాలు ఏ ఒకటి చూడకుండా అర్హులై ఉంటే ప్రతి ఒక్కరికీ సంక్షేమ కార్యక్రమాలు కింద జగన్‌మోహన్‌రెడ్డి డబ్బులు జమ చేశారని ఆయన అన్నారు. అనంతరం వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని ముటుకూరు సచివాలయం పరిధిలోని ఖోఖో జట్టు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి చేరింది. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్, యార్డు ఛైర్మన్ వెలిదండి గోపాల్, జడ్పీటీసీ శెట్టిపల్లి యల్లమంద, ఊరుబిండి మన్నెయ్య, చల్లా వెంకమ్మశ్రీనివాసరావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి విజేతలకు షూస్ అందజేత

విశాలాంధ్ర-తాడేపల్లి : ఆడదాం ఆంధ్రా మంగళగిరి నియోజకవర్గం నుంచి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో గెలుపొందిన విజేతలు టి.లక్ష్మీ సాయి దుర్గ, టి.పల్లవి సాహిశ్రీ, కె.హేమ, వి.తనుశ్రీ, ఎం.వైష్ణవి, వి.సుప్రియ, షేక్ హరిఫా, షేక్ రమాజా, ఎస్‌డీ మస్తానీ, పి.దీపిక, సిహెచ్ సుస్మిత, సి.దేవి, వాలీబాల్ టీంకి వైసీపీ ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతి రెడ్డి వేమారెడ్డి, వాలిబాల్ కిట్ షూస్ అందచేశారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ బాలికల క్రీడానైపుణ్యాన్ని గుర్తించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆడదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పీడీ రమేష్, పీఈటీలు రజనీ నాయక్, పి.రవి, పీడీ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మరాజుకు తెలుగు భాష సేవారత్న పురస్కారం

విశాలాంధ్ర - గుంటూరు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఫిబ్రవరి 5: తెలుగు భాష విశ్వవ్యాప్తికి అధికార భాషా సంఘం, ఆంధ్ర ప్రదేశ్ తెలుగు సంఘం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో తెలుగు పత్రికా రంగంలో లబ్ద ప్రతిష్టలైన సంపాదకులు, రచయితలు, జర్నలిస్టులు 30 మందికి తెలుగు భాషారత్న సాఫల్య, తెలుగు భాష సేవారత్న పురస్కారాల ప్రదానం వైభవోపేతంగా జరిగింది. వీరిలో సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు ఉన్నారు. సభా నంతరం సహచర జర్నలిస్టులు నిమ్మరాజును సత్కరించారు. అధికార భాషాసంఘం అధ్యక్షుడు, కార్యక్రమ రథసారథి పి విజయబాబు అధ్యక్షతన జరిగిన ఈ బృహత్తర కార్యక్రమంలో సి ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య రాజశేఖర్, విశ్రాంత ఆచార్యులు పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ , ఆంధ్ర తెలుగు సంఘం చైర్మన్ మేడపాటి వెంకట్, సినీ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, జర్నలిజం విభాగాధిపతి ప్రొఫెసర్ జి అనిత, అకాడమీ కార్యదర్శి మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి షేక్.నూరి ఫాతిమా అన్నారు. సోమవారం సాయంత్రం నూరిఫాతిమా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా ముఖ్యఅతిథిగా మంగళదాస్ నగర్‌లో ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో '57వ డివిజన్ నేతలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో భారీ మెజార్టీతో నూరి ఫాతిమాను గెలిపించాలని కోరారు. స్థానిక కార్పోరేటర్ పఠాన్ రిహాన, వైసీపీ నేతలు కర్నూమా, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఏపీ బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా వేముల

విశాలాంధ్ర-వినుకొండ : ఆంధ్ర ప్రదేశ్ బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా పట్టణానికి చెందిన వేముల శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఏపీ బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ జాతీయ అధ్య క్షులు పాలూరి రామకృష్ణయ్య చేతులమీదుగా శ్రీనివాస్‌రావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా నియామక పత్రాలు స్వీకరించారు. మరియు నరసరావుపేట పార్లమెంటరీ అభ్యర్థిగా వేముల శ్రీనివాసరావును ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస రావు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ గ్రామ స్థాయి నుండీ, రాష్ట్ర స్థాయి వరకు బూత్ లెవెల్ నుండి బలోపేతం చేస్తామని అన్నారు. ఆంధ్రరాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఆర్థికంగా విద్యాపరంగా, ఉద్యోగ పరంగా, రాజకీయా పరంగా, అభివృద్ధి చెందాలని, ఆవిధముగా, అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని వారిలో నూతన ఉత్తేజాన్ని పెంపొందించు కుంటూ పోతామని 2024లో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లోనూ అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లోనూ పోటీ చేస్తామని ఎక్కువ సీట్లు గెలుపొందు తామని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలు, బడుగు, బలహీన, దళిత వర్గాల ప్రజలు అందరూ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ కి మద్దతు తెలుపుతున్నారు అని అన్నారు.

11న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం

విశాలాంధ్ర-నకరికల్లు : మండల కేంద్రమైన నకరికల్లులో రామదాసు కాలనీ నందు వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం నందు ఈ నెల 11వతేదీ ఆదివారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠా మహోత్సవం జరుగు తుందని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలియజేశారు. ఈ నెల 9వ తేదీన ప్రతిష్ఠా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 9వతేదీ శుక్రవారం సుప్రభాతసేవ, దేవాలయ తోరణం, గోపూజ, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, వివిధ ద్రవ్యములతో అభిషేకాలు, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాదాల వితరణ ఉంటుందన్నారు. 10వ తేదీ శనివారం విష్వక్సేనపూజ, అగ్ని ప్రతిష్టాపన, క్షీరాధివాసము, నవ కలశ స్నాపన, జలాధివాసము, అదివాసహోమం, మూర్తి హోమం, యుక్త హోమం, విశేష పూజల అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ, సాయంత్రం ప్రభూత బలిహరణ, నవగ్రహారాధన, నిత్య హోమములు, మూలమంత్ర హోమం, పారమాత్మిక మహాశాంతి హోమం జరుగుతుందన్నారు. 11వతేదీ ఆదివారం ఉదయం 8.43 నిమిషాలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరుగుతుందని కమిటీ సభ్యులు తెలియజేశారు.

దుర్గి తాహాశీల్దార్‌గా రజని కుమారి ఉద్యోగ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-దుర్గి: దుర్గి తాహాశీల్దార్‌గా జి.రజని కుమారి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆమె ప్రకాశం జిల్లా, మద్దిపాడు మండలం తహాశీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ సార్వత్రిక ఎన్నికల్లో అధికారులు బదిలీల్లో భాగంగా దుర్గి మండలానికి వచ్చారు. ఇప్పటి వరకు తహాశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జి.రమేష్ కుమార్ ప్రకాశం జిల్లా, మార్కాపురం టౌన్‌కు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఆమె కార్యాలయ సిబ్బంది, విఆర్వోలతో సమీక్ష చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, విఆర్వోలు, సర్వే అసిస్టెంట్లు స్వాగతం పలికి పుష్ప గుచ్చాలు అందజేసి, అభినందనలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఉన్నతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

శావల్యాపురం తాహాశీల్దారుగా లక్ష్మి లావణ్య

విశాలాంధ్ర-శావల్యాపురం: శావల్యాపురం తాహాశీల్దారుగా నక్కా లక్ష్మీ లావణ్య సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఈమె ఇప్పటి వరకు సూపర్నెంట్‌గా సీసీఎల్ఏ మంగళగిరి కార్యాలయంలో పనిచేస్తూ సాధారణ ఎన్నికల బదిలీలలో బాగంగా శావల్యాపురం మండలానికి వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన లావణ్యను డీటీ వేముల వెంకట నాగరాజు, రీసర్వే డీటీ నాసరయ్య, వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది పుష్ప గుచ్ఛాలుతో ఆహ్వానించి సత్కరించారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రభాకర్

విశాలాంధ్ర-పెదకూరపాడు: మండల తాసిల్దారుగా ప్రభాకర్ రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన ప్రకాశం జిల్లా చీరాలలో తాసిల్దారుగా బాధ్యతలు నిర్వహించి సాధారణ బదిలీపై పెదకూరపాడు వచ్చారు. బాధ్యతలు చెప్పిన ప్రభాకర్ రావును డిప్యూటీ తాసిల్దార్ వీఆర్వోలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. మండలలోని పలువురు నేతలు నూతన తాసిల్దారును కలసి అభినందించారు. సూపర్నెంట్ నిర్మలా కృష్ణ, విఆర్ఓ నరసింహారావు, సచివాలయ సిబ్బంది తదితరులు బొకే ఇచ్చి అభినందించారు.

తహసీల్దార్‌గా వెంకట రమణ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-అమరావతి: అమరావతి మండల తహసీల్దార్‌గా ఏవి వెంకటరమణ సోమవారం బాధ్యలు స్వీకరించారు. ప్రభుత్వ పరంగా రెవిన్యూ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించి ప్రజలకు తగు న్యాయం చేయగలవాడనని అన్నారు.

వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన వరల్డ్ బ్యాంక్ టీం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని గణపతి నగర్‌లో గల ఇందిరానగర్ అర్బన్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం వరల్డ్ బ్యాంక్ టీం సందర్శించింది. వైద్యశాలలో పేదలకు అందిస్తున్న సర్వీసులను టీం సభ్యులు అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల వివరాలను హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ పి.అనూష వారికి వివరించారు. హెల్త్ సెంటర్‌కు నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ అవార్డు లభించిన విషయం విధితమే. ఆసుపత్రిలో అందుతున్న మెరుగైన సేవలకు గాను వరల్డ్ బ్యాంక్ టీం సభ్యులు డాక్టర్ అనూషను ప్రత్యేకంగా అభినందించారు. మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ వెల్ఫేర్ విభాగం తరపున మిస్టర్ షాహిద్ అలీ వర్సీ, ఎన్‌హెచ్ఎస్ఆర్సీ తరపున డాక్టర్ అర్పిత అమిన్, వరల్డ్ బ్యాంక్ టీం తరపున షీనా చబ్రా, డాక్టర్ గురు రాజేష్ వైద్యశాలను సందర్శించిన వారిలో ఉన్నారు. స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి, స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమాదేవి, స్టేట్ కన్సల్టెంట్ వేణు కుమార్, డాక్టర్ స్టెఫీ గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి: చేనేతకు చేయూత కార్యక్రమంలో భాగంగా 8వ విడతలో మంగళగిరి పట్టణంలోని 18, 19, 24 వార్డులకు చెందిన 60 మంది చేనేత మహిళలకు చేనేత కమిటీ నాయకులు రాట్నాలు అందజేశారు. సోమవారం టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో చేనేత కమిటీ నాయకులైన నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, మంగళగిరి పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కారంపూడి అంకమ్మరావు ఆధ్వర్యంలో రాట్నాలు పంపిణీ చేశారు.